


శనివారం రాజ్‌భవన్‌లో కేంద్ర యువజన, క్రీడాభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో జరిగిన జానపద, సాంస్కృతిక కార్యక్రమాల్లో యువతతో కలిసి కాలు కదుపుతున్న రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి

నగరాన్ని వీడని మంచు

విమానసేవలకు అంతరాయం

నత్తనడకన వాహనాలు





గిండి కత్తిపారా ఫ్లైఓవర్‌పై అలముకున్న మంచు - పల్లావరం రైల్వేస్టేషన్ సమీపంలో దట్టంగా కురుస్తున్న మంచు

చెన్నై, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): చెన్నై శివారుతో పాటు నగరంలోని పలు ప్రాంతాలపై శనివారం వేకువజామున దట్టమైన మంచు దుప్పటి పరచుకుంది. దీంతో నగరవాసులు, వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. విమాన సేవలకూ అంతరాయం కలిగింది. శనివారం వేకువజామున 5.30 గంటలకు నగరంలో పలు ప్రాంతాల్లో రహదారులు కనిపించనంతగా మంచు కురిసింది. మంచుకు తోడు చలికూడా ఉండటంతో నగరవాసులు ఉదయం ఏడు గంటల దాటినా ఇంటి నుంచి బయటకు రావడంలేదు. షోళింగనల్లూరు, పెరుంబాక్కం, ఈస్ట్‌కోస్ట్‌రోడ్డు, మేడవాక్కం, చీట్లపాక్కం, వేళచ్చేరి తదితర ప్రాంతాలలో దట్టమైన మంచు అలముకుంది. చెంగల్పట్టు జిల్లా మధురాంతకం పరిసర ప్రాంతాల్లోనూ మంచు అధికం కావటంతో ఆ ప్రాంతాల్లోని జాతీయ రహదారులలో వాహనాలు హెడ్‌లైట్లు వేసుకునే నడపాల్సి వచ్చింది.

10 విమానాల మళ్లింపు...

మీనంబాక్కం వద్ద ఉదయం ఏడుగంటల వరకు మంచు వీడకపోవడంతో విమాన సేవలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. 10 విమానాలను ఇతర ప్రాంతాలకు మళ్ళించారు. 26 విమానాలను ఆలస్యంగా నడిపారు. మీనంబాక్కం పరిసర ప్రాంతాల్లో ఉదయం ఏడుగంటలు దాటినా మంచు కురిసింది. దీంతో లండన్, కౌలాలంపూరు, దోహా, సింగపూరు, శ్రీలంక, అండమాన్, ముంబై తదితర ప్రాంతాల నుండి వచ్చిన 10 విమానాలు ల్యాండింగ్ కాలేక అరగంటపాటు ఆకాశంలోనే చక్కర్లు కొట్టాయి. ఆ తర్వాత ఆ విమానాలను హైదరాబాద్, బెంగళూరు, తిరువనంతపురం విమానాశ్రయాలకు మళ్ళించారు. రన్‌వేలపై దట్టమైన మంచు ఉండడంతో కోయంబత్తూరు, ముంబై, తిరువనంతపురం, తిరుచ్చి, బెంగళూరు, హైదరాబాద్ నుండి వచ్చిన 12 విమానాలు తక్కువ ఎత్తులో ఆకాశంలోనే చక్కర్లు కొట్టాయి. అరగంట తర్వాత ఆ విమానాలు ల్యాండింగ్ అయ్యాయి. అదే సమయంలో నగరం నుండి బయలుదేరాల్సిన విమానాలు నిర్దేశిత సమయం కంటే అరగంట నుండి గంట దాకా ఆలస్యంగా బయలుదేరాయి.

● రైలులో గర్భిణిపై దాడితో అప్రమత్తం ..

మహిళా బోగీల్లో తనిఖీలకు ఆదేశం



చెన్నై, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా జోలార్‌పేట వద్ద కోయంబత్తూరు-తిరుపతి రైలులో గర్భిణిపై అత్యాచారయత్నానికి పాల్పడి, ఆమె ప్రతిఘటించడంతో కదిలే రైలు నుంచి తోసివేసిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. దీంతో, రైళ్లలోని మహిళా బోగీల్లో ముమ్మర తనిఖీలు చేపట్టాలని రైల్వే పోలీసులకు డీజీపీ వన్నియపెరుమాళ్ ఆదేశించారు. రైలు స్టేషన్‌కు చేరిన వెంటనే పోలీసులు ఆ బోగీలో తనిఖీ చేయాలన్నారు. ఈ బోగీలో పురుషులు ఎవరైనా ఉంటే వారిని వెంటనే అదుపులోకి తీసుకొని విచారించాలని తేల్చిచెప్పారు. దీంతో, చెన్నై, సేలం, మదురై, కోవై సహా అన్ని ప్రధాన రైల్వేస్టేషన్లలో రైల్వే పోలీసులు శనివారం ఉదయం నుంచి తనిఖీలు చేపట్టారు. రాత్రి వేళల్లో కూడా పోలీసుల్ని నియమించి రైళ్లను పర్యవేక్షించనున్నట్లు రైల్వే పోలీసు అధికారులు తెలిపారు.





ఆవడి సభలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్



ఓట్ల కోసం ఆరాటం..

ప్రజాసంక్షేమంపై నిర్లక్ష్యం

బీజేపీ పాలకుల తీరు ఇదే...! ● ఆవడి సభలో సీఎం స్టాలిన్ ధ్వజం

చెన్నై, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): అన్ని రాష్ట్రాల్లో తమ పార్టీ ఆధిపత్యమే కొనసాగాలంటూ ప్రతి ఎన్నికల్లోనూ ఓట్ల వేటే లక్ష్యంగా పెట్టుకుని కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ మండిపడ్డారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి నిధులు మంజూరు చేయలేదని ఆరోపిస్తూ, కేంద్రం తీరును ఖండిస్తూ రాష్ట్రమంతటా ప్రధాన నగరాల్లో శనివారం నిరసన సభలు జరిగాయి. ఆ మేరకు ఆవడిలో జరిగిన నిరసనసభలో స్టాలిన్ మాట్లాడుతూ.. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రాన్ని పూర్తిగా విస్మరించడం వలనే నిరసన సభలు చేయాల్సివచ్చిందన్నారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికే కాకుండా బీజేపీయేతర రాష్ట్రాలకు కూడా మొండి చేయి చూపారని ఆరోపించారు. విద్యకు అత్యంత స్వల్పంగా 2.3 శాతం నిధులు మాత్రమే కేటాయించడం బీజేపీకి విద్యపట్ల ఎంత ఆసక్తి ఉందో స్పష్టం చేస్తోందని విమర్శించారు. ధాన్యానికి గిట్టుబాటు ధరలను కూడా ప్రకటించలేదన్నారు. ఆర్థికాభివృద్ధికి తోడ్పడే పథకాలు బడ్జెట్‌లో లేవని, ఎరువులు, వంటగ్యాస్‌కు ఇస్తున్న సబ్సిడీని బాగా తగ్గించేశారని, అందరికీ కోసం మా బడ్జెట్ అని గొప్పలు చెప్పుకున్న బీజేపీ పాలకులు బీహార్ రాష్ట్రానికే అధిక ప్రాధాన్యతనిచ్చి పథకాలను ప్రకటించారని, ఆ రాష్ట్రంలో త్వరలో శాసనసభ ఎన్నికలు జరుగనుండటం వల్లే ఈ తాయిలాలను ప్రకటించారని స్టాలిన్ విమర్శించారు. గత యేడాది ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఆ రాష్ట్రానికి పలు పథకాలు ప్రకటించారన్నారు. వీటన్నింటినీ నిశితంగా పరిశీలిస్తే కేంద్రంలోని బీజేపీ పాలకులకు ప్రజా సంక్షేమంపై ఏ మాత్రం ఆసక్తి లేదని, ఓటు బ్యాంకు ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని పరిపాలిస్తున్నారని ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్‌కు, బీహార్‌కు పథకాలు ప్రకటించవద్దని తాము చెప్పటం లేదని, ఆ రాష్ట్రాలతోపాటు తక్కిన రాష్ట్రాలకు నిధులిమ్మని మాత్రమే అడుగుతున్నామని స్టాలిన్ పేర్కొన్నారు. భారత ఆర్థికరంగానికి వెన్నెముకగా ఉన్న తమిళనాడుపై కేంద్ర నిర్లక్ష్యం ప్రదర్శించడం భావ్యం కాదని అన్నారు. కేంద్రం నిధులిచ్చి సహకరించి ఉంటే రాష్ట్రం మరింత పురోగతి సాధించి ఉండేదన్నారు. ఈరోడ్ ఈస్ట్ ఉప ఎన్నికల్లో డీఎంకేకు ఓటర్లు పట్టం కట్టారని, ఈ గెలుపు వచ్చే యేడాది జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లోనూ తమ కూటమి విజయం సాధిస్తుందని స్పష్టపరుస్తోందని స్టాలిన్ ఆశాభావం వ్యక్తం చేశారు.



డీఎంకే ప్రధాన కార్యాలయం అరివాలయం వద్ద జెండాలు పట్టుకుని గెంతులేస్తున్న పార్టీ నేతలు

ఈరోడ్ ఈస్ట్‌లో

డీఎంకే ఘన విజయం

● చంద్రకుమార్‌కు 90,629 ఓట్ల ఆధిక్యం

● డిపాజిట్ కోల్పోయిన ఎన్టీకే అభ్యర్థి ● అరివాలయంలో సంబరాలు

చెన్నై, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఈరోడ్ తూర్పు శాసనసభ నియోజకవర్గ ఉప ఎన్నికలో డీఎంకే ఘన విజయం సాధించింది. ఆ పార్టీ అభ్యర్థి చంద్రకుమార్ తన సమీప ప్రత్యర్థి, నామ్ తమిళర్ కట్చి (ఎన్టీకే) అభ్యర్థి సీతాలక్ష్మిపై 90629 ఓట్ల ఆధిక్యత కనబరిచారు. ఈ నియోజకవర్గంలో ఎన్టీకేకి గత ఎన్నికల కంటే రెట్టింపు ఓటు బ్యాంక్ లభించినప్పటికీ ఆ పార్టీ అభ్యర్థి డిపాజిట్ కోల్పోయారు. ఈరోడ్ ఈస్ట్ నియోజకవర శాసనసభ్యుడు ఈవీకేఎస్ ఇళంగోవన్ మృతితో ఈ నెల 5న ఆ నియోజకవర్గానికి ఉప ఎన్నిక నిర్వహించిన విషయం తెలిసిందే. డీఎంకే తరఫున వీసీ చంద్రకుమార్, నామ్ తమిళర్ కట్చి తరఫున సీతాలక్ష్మిసహా 46 మంది పోటీ చేశారు. ఈ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ శాతాన్ని ప్రకటించడంలో ఎన్నికల అధికారులు అయోమయానికి గురయ్యారు. మొదట 77 శాతంపైగా ఓట్లు పోలైనట్లు ప్రకటించిన అధికారులు ఈ నెల ఆరోతేదీ వేకువజామునకల్లా 67.97 శాతం ఓట్లు మాత్రమే పోలైనట్లు పేర్కొన్నారు. మొత్తం 2,27,546 మంది ఓటర్లకు గాను లక్షా 54 వేల 657 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. చిత్తేడులోని ఐఆర్‌టీటీ కళాశాల కౌంటింగ్ కేంద్రంలో శనివారం ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభమైంది. మొత్తం 17 రౌండ్లుగా ఓట్లను లెక్కించారు.

పెరియార్ సీమలో అద్భుత విజయం: స్టాలిన్

ఈరోడ్ ఈస్ట్ నియోజకవర్గంలో డీఎంకే అభ్యర్థి చంద్రకుమార్ విజయంపై ఆ పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి స్టాలిన్ స్పందిస్తూ ద్రవిడ ఉద్యమనేత పెరియార్ జన్మించిన భూమిలో తొలిసారిగా అద్భుత విజయాన్ని సాధించామన్నారు. ఆవడిలో శనివారం సాయంత్రం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని ఖండిస్తూ ఏర్పాటైన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ.. ఈ ఉప ఎన్నికలో పోటీ చేసిన అభ్యర్థులంతా ధరావతు కోల్పోయారని, రాబోవు అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే కూటమి ఘనవిజయం సాధిస్తుందని ఈరోడ్ ఈస్ట్ ఓటర్లు తేల్చిచెప్పారని వ్యాఖ్యానించారు.





చిత్తేడు కౌంటింగ్ సెంటర్‌లో ఓట్లను లెక్కిస్తున్న ఎన్నికల సిబ్బంది - టపాకాయలు కాల్చుతున్న డీఎంకే శ్రేణులు

ఆది నుంచే డీఎంకే అభ్యర్థి ఆదిక్యత

తొలి రౌండ్ నుంచి డీఎంకే అభ్యర్థి ఎన్టీకే అభ్యర్థిపై తిరుగులేని ఆదిక్యత ప్రదర్శించారు. డీఎంకే అభ్యర్థి చంద్రకుమార్ 1,14,439 ఓట్లు సాధించి గెలిచారు. ఎన్టీకే అభ్యర్థి సీతాలక్ష్మికి 23,810 మాత్రమే ఓట్లు పోలయ్యాయి. ఈ ఎన్నికల్లో ఆమె డిపాజిట్ పొందటానికి 25,777 అవసరం కాగా 1967 ఓట్లు తగ్గటంతో డిపాజిట్ కోల్పాయారు. ఆమె సహా 45 మంది అభ్యర్థులు ధరావతు కోల్పోయారు. ఈ ఓట్ల లెక్కింపులో నోటాకు 4708 ఓట్లు పడ్డాయి.

ఈ విజయం స్టాలిన్‌కే అంకితం

చంద్రకుమార్



ఈరోడ్ ఈస్ట్ నియోజకవర్గంలో తాను సాధించిన విజయాన్ని డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌కు సమర్పిస్తున్నట్లు విజేత చంద్రకుమార్ ప్రకటించారు. ఎన్నికల ఫలితాలు ప్రకటించిన తర్వాత ఆయన కౌంటింగ్ కేంద్రం వద్ద మీడియాతో మాట్లాడారు. ఈ నియోజకవర్గంలో ప్రధాన ప్రతిపక్షం పోటీ చేయకపోవడం వల్లే ఎన్టీకే అభ్యర్థికి, నోటాకు అత్యధిక ఓట్లు పోలయ్యాయని చెప్పారు. ఈరోడ్ ఈస్ట్ ఉప ఎన్నిక గెలుపు వచ్చే యేడాది జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో విజయానికి శాంపిల్ అని అన్నారు.

తపాలా ఓట్లలో నోటాకు ద్వితీయస్థానం...

ఈ ఉప ఎన్నిక తపాలా ఓట్ల లెక్కింపులో నోటా ద్వితీయ స్థానం సంపాదించుకుంది.. డీఎంకే అభ్యర్థి చంద్రకుమార్‌కు 197 ఓట్లు, నోటాకు 18 ఓట్లు, ఎన్టీకే అభ్యర్థి సీతాలక్ష్మికి 13 ఓట్లు మాత్రమే పడ్డాయి.

అరివాలయంలో సంబరాలు...

ఈరోడ్ ఈస్ట్ ఎన్నిక ఫలితాలు వెలువడగానే తేనాంపేటలోని డీఎంకే ప్రధాన కార్యాలయం అన్నా అరివాలయం వద్ద పండుగ వాతావారణం చోటుచేసుకుంది. ఐదో రౌండ్ ఓట్ల లెక్కింపు నుంచే పార్టీ అభ్యర్థి ఆదిక్యత స్పష్టం కాగానే నగరం నలుమూలల నుండి కార్యకర్తలు పార్టీజెండాలు పట్టుకుని అరివాలయానికి చేరుకున్నారు. సాయంత్రం ఐదు గంటలకు 90వేల పైచిలుకు మెజారిటీతో డీఎంకే అభ్యర్థి చంద్రకుమార్ గెలుపొందినట్లు ప్రకటించగానే పార్టీ శ్రేణులు గెంతులేశారు. మరికొందరు బాణా సంచా కాల్చారు. అరివాలయంలో ఉన్న డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి స్టాలిన్‌ను కలుసుకుని పార్టీ వాణిజ్యవిభాగం నేత వీపీ మణి స్వీట్లు తినిపించారు. మంత్రి దురైమురుగన్ తదితర నేతలకు కూడా లడ్డూలు పంచిపెట్టారు.

క్రీడాకారులకు నజరానా

● కమాలిని, సుబ్రమణ్యంలకు రూ.25 లక్షల చొప్పున ప్రోత్సాహకం

● సీఎం స్టాలిన్ ప్రకటన

పెరంబూర్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): అండర్-19 క్రికెట్ ప్రపంచ కప్ గెలుచుకున్న భారత జట్టులోని రాష్ట్ర క్రీడాకారిణి కమాలిని, ప్రపంచ ఖోఖో ఛాంపియన్ షిప్ కైవసం చేసుకున్న భారత జట్టులోని రాష్ట్ర క్రీడాకారుడు సుబ్రమణ్యంకు ప్రోత్సాహకంగా తలా రూ.25 లక్షల ఇవ్వనున్నట్లు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రకటించారు.

సమాచార దర్శిని

26 నుంచి ఈ-కామర్స్‌పై శిక్షణ

పెరంబూర్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఔత్సాహిక పారిశ్రామికవేత్తల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 'ఈ-కామర్స్' వ్యాపారంపై ఈ నెల 26 నుంచి మూడు రోజులు శిక్షణ ఇవ్వనున్నారు. ఈ-కామర్స్ వ్యాపారం ఏమిటి? ఎలాంటి వ్యాపారాలు చేయవచ్చు, ఎగుమతి, దిగుమతుల అంశాలు సహా పలు విషయాలపై నిపుణులు శిక్షణ ఇవ్వనున్నారు. ఆసక్తి కలిగిన వారు www.editn.in అనే వెబ్‌సైట్, సోమవారం నుంచి శుక్రవారం వరకు ఉదయం 10 నుంచి సాయంత్రం 5.45 గంటల వరకు 9080609808, 9841693060 అనే నెంబర్లు సంప్రదించవచ్చు.

11న మద్యం దుకాణాలకు సెలవు

పెరంబూర్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): వళ్లలార్ వర్ధంతి సందర్భంగా ఈ నెల 11న టాస్మాక్ దుకాణాలకు సెలవు ప్రకటించారు.ఆప్రకారం, వచ్చే మంగళవారం నగరంలోని మద్యం దుకాణాలు, బార్లు, క్లబ్, హోటళ్లు తదితరాలు మూతపడనున్నాయి. నిబంధనలు అతిక్రమించి మద్యం విక్రయించే వారిపై కఠిన చర్యలు చేపడతామని చెన్నై జిల్లా కలెక్టర్ రష్మి సిద్దార్థ్ ఒక ప్రకటనలో హెచ్చరించారు.

ప్రయాణికులు ఫిర్యాదు చేసేందుకు వాట్సాప్ నెంబరు

పెరంబూర్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): నగరంలో నడుపుతున్న సిటీ బస్సులకు సంబంధించి ప్రయాణికులు ఫిర్యాదుచేసేలా వాట్సాప్ నెంబరు పరిచయం చేసినట్లు ఎంటీసీ తెలిపింది. ఈ మేరకు మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ విడుదల చేసిన ప్రకటనలో... ప్రయాణికులు సౌకర్యవంతమైన ప్రయాణం చేసేలా సిటీ బస్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఇప్పటికే బస్సుల పనితీరు, ప్రయాణంలో సమస్యలు ఎదురైతే, వాటిని ఫిర్యాదుచేసేలా '149' అనే టోల్ ఫ్రీ నెంబరు అందుబాటులో ఉందన్నారు. ప్రస్తుతం 9445033364 అనే వాట్సాప్ నెంబరు పరిచయం చేసినట్లు, ప్రయాణికులు ఈ వాట్సాప్ ద్వారా తెలిపే సమస్యలను సత్వరం పరిష్కరించేలా చర్యలు చేపడతామని ఎంటీసీ తెలిపింది.

నగరంలో మళ్లీ 'డబుల్ డెక్కర్' బస్సులు

పెరంబూర్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): నగరంలో మళ్లీ డబుల్ డెక్కర్ బస్సులు నడిపేలా, 625 ఎలక్ట్రికల్ బస్సులు కొనుగోలు చేయాలని మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (ఎంటీసీ) నిర్ణయించింది. జనాభా పెరుగుదలకనుగుణంగా బస్సులు నడపడం లేదనే ఫిర్యాదులున్నాయి. ఈ నేపథ్యంలో, ఎలక్ట్రిక్ డబుల్ డెక్కర్ బస్సులు నడపాలని ఎంటీసీ నిర్ణయించింది. ఈ బస్సులు నడిపే ప్రాంతాలు, అందుకు అనుకూలమైన రోడ్లు తదితరాలపై అధ్యయనం చేసిన ఎంటీసీ, అనుమతుల కోసం రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక పంపింది. ప్రభుత్వ అనుమతులు లభించిన వెంటనే, టెండర్లు ఆహ్వానించి బస్సులను ప్రజల అందుబాటులోకి తీసుకొస్తామని ఎంటీసీ తెలిపింది.

21న ప్రభుత్వ కార్యాలయాల్లో మాతృభాష పరిరక్షణ ప్రతిజ్ఞ

పెరంబూర్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మాతృభాషల ప్రాముఖ్యత, వాటి ప్రత్యేకతలు తెలిపేలా ఫిబ్రవరి 21వ తేదీ అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవంగా జరుపుకుంటున్నారు. 1999లో యునెస్కో జనరల్ కౌన్సిల్ సమావేశంలో నిర్ణయం తీసుకొని, 2000వ సంవత్సరం నుంచి మాతృభాషా దినోత్సవం నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది మాతృభాషా దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలల్లో మాతృభాష పరిరక్షణ ప్రతిజ్ఞ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.

24 నుంచి టైపిస్ట్ పోస్టుల సర్టిఫికెట్ల పరిశీలన

పెరంబూర్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-4 విభాగంలో టైపిస్ట్ పోస్టుల భర్తీకి సంబంధించిన సర్టిఫికెట్ల పరిశీలన ఈ నెల 24 నుంచి మార్చి 5వ తేది వరకు టీఎన్‌పీఎస్సీ కార్యాలయంలో జరుగనుంది. ఈ మేరకు టీఎన్‌పీఎస్సీ కార్యదర్శి ఎస్.గోపాల్ సుందరరాజ్ విడుదల చేసిన ప్రకటనలో... ఇప్పటికే అర్హత సాధించిన వారి పేర్లు టీఎన్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో విడుదల చేశామని, అభ్యర్థులకు ఇంటర్వ్యూ తేది, సమయం తదితర వివరాలు వారి ఈ-మెయిల్‌కు, పోస్టు ద్వారా పంపినట్లు తెలిపారు. ఈ విభాగంలో జూనియర్ అసిస్టెంట్, ఇతర పోస్టులు ఎంచుకున్న అభ్యర్థులు, ఆహ్వానించినప్పటికీ టైపిస్ట్ పోస్టుల ఇంటర్వ్యూకు అనుమతించమని తెలిపారు. సర్టిఫికెట్ పరిశీలనలకు పిలిచిన వారందరిని ఉద్యోగాలకు ఎంపిక చేస్తామని హామీ ఇవ్వలేమని తెలిపారు. ఇంటర్వ్యూకు హాజరుకాని అభ్యర్థులకు రెండో అవకాశం కూడా ఉండదని ఆయన స్పష్టం చేశారు.

నాలుగు రోజుల పాటు రోప్‌కార్ సేవలకు అంతరాయం

పెరంబూర్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): రాణిపేట జిల్లా షోలింగర్ యోగ నరసింహస్వామి ఆలయ రోప్‌కార్ సేవలకు నాలుగు రోజులు అంతరాయం కలుగుతుందని అధికారులు తెలిపారు. ఈ కొండ ఆలయానికి భక్తులు వెళ్లాలంటే 1,305 మెట్లు ఎక్కాల్సి ఉంది. పిల్లలు, వృద్ధుల సౌకర్యార్థం రోప్ కార్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఈ రోప్‌కార్‌లో ఆలయానికి వెళ్లాలంటే ఒకరికి రూ.50, ఆలయం నుంచి కిందకు రావాలంటే రూ.50 వసూలుచేస్తున్నారు. ఈ నేపథ్యంలో, రోప్‌కార్‌కు నెల వారీ మరమ్మతులు చేపట్టనుండడంతో, ఆదివారం నుంచి ఈ నెల 12వ తేది వరకు ఈ సేవలు నిలిపివేస్తున్నట్లు, 13వ తేది నుంచి రోప్‌కార్ సేవలు యధావిధిగా కొనసాగుతాయని ఆలయ అధికారులు తెలిపారు.

రేపటి నుంచి చదురగిరికి భక్తులకు అనుమతి

పెరంబూర్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): విరుదునగర్ జిల్లా పశ్చిమ కనుమల్లోని చదురగిరి సుందర మహాలింగం ఆలయానికి ఈ నెల 10 నుంచి 13వ తేది వరకు నాలుగు రోజులు భక్తులను అనుమతించనున్నారు. ఈ ఆలయంలో అమావాస్య, పౌర్ణమి, ప్రదోష పూజలకు మాత్రమే భక్తులను అనుమతిస్తుంటారు. ఈ నెల 12వ తేది పౌర్ణమి కావడంతో, సుందర మహాలింగం ఆలయంలో నిర్వహించనున్న ప్రత్యేక పూజలకు భక్తులను అనుమతించనున్నట్లు అటవీ శాఖ తెలిపింది. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మాత్రమే భక్తులను కొండ మార్గంలోకి అనుమతిస్తామని, రాత్రి వేళ ఆలయం, కొండ ప్రాంతాల్లో భక్తులు బస చేసేందుకు అనుమతించమని అధికారులు తెలిపారు.

అగ్గిపెట్టెల కర్మాగారంలో అగ్నిప్రమాదం

● రూ.2 కోట్లమేర ఆస్తినష్టం



చెన్నై, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): తూత్తుకుడి జిల్లా కోవిల్‌పట్టిలోని అగ్గిపెట్టెల కర్మాగారంలో శుక్రవారం రాత్రి సంభవించిన అగ్ని ప్రమాదంలో రూ.2 కోట్ల విలువైన అగ్గిపెట్టెల పార్శిళ్లు, రసాయన వస్తువులు, యంత్రాలు, ఫర్నిచర్ బుగ్గిపాలయ్యాయి. కోవిల్‌పట్టి శివారులోని సిడ్కో పారిశ్రామికవాడలో విజయకాంత్ అనే వ్యక్తికి చెందిన అగ్గిపెట్టెల కర్మాగారాన్ని కోవిల్‌పట్టికి చెందిన సెన్నగవినాయకమూర్తి, సిరాజ్ అనే వారు లీజుకు తీసుకుని నడుపుతున్నారు. ఆ కర్మాగారంలో 20 మందికి పైగా కార్మికులు పనిచేస్తుంటారు. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి అగ్ని ప్రమాదం సంభవించడంతో భద్రపరచిన అగిపెట్టెల స్టాక్, రసాయనాలు, యంత్రాలకు నిప్పంటుకుంది. ఈ సమాచారం అందుకున్న అగ్నిమాపక దళం హుటాహుటిన అక్కడికిచేరుకుని సుమారు మూడు గంటలపాటు శ్రమించి మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో మునియసామి (55) అనే కార్మికుడు తీవ్రంగా గాయపడ్డాడు. కోవిల్‌పట్టి ఈస్ట్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

'ఈగో'లు పక్కన పెట్టండి...!

● దేశం, ప్రజల రక్షణకు కృషిచేయండి
● 'ఇండియా' కూటమి నేతలకు తిరుమావళవన్ సలహా



తిరుమావళవన్

పెరంబూర్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): 'ఇండియా' కూటమిలోని పార్టీలు 'ఈగో'లు పక్కనపెట్టి, దేశం, ప్రజల రక్షణ కోసం కృషిచేయాలని డీపీఐ అధ్యక్షుడు తిరుమావళవన్ సూచించారు. మదురై విమానాశ్రంలో శనివారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ... ఢిల్లీ శాసనసభ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడం దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. ఆమ్ ఆద్మీ ఈ స్థాయిలో పరాజయం చెందుతుందని ఊహించలేదన్నారు. ఢిల్లీలో బీజేపీ అధికారం చేపట్టడం దేశానికి ఎదురు దెబ్బగా భావించాలన్నారు. ఈ ఎన్నికలను ఆమ్ ఆద్మీ, కాంగ్రెస్ కలసి పోటీచేయకపోవడమే పరాజయానికి కారణమన్నారు. ఢిల్లీ ఎన్నికల ఫలితాలు ఒక గుణపాఠంగా భావించాలన్నారు. పార్లమెంటుతో పాటు శాసనసభ ఎన్నికల్లోనూ ఇండియా కూటమి పార్టీలు సమన్వయంతో వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ విషయమై కూటమి నేతలు త్వరలో సమావేశమై చర్చించాలని కోరారు. ఈరోడ్ ఉప ఎన్నికల్లో ఊహించిన విధంగానే డీఎంకే విజయం సాధించిందని తిరుమావళవన్ తెలిపారు.

5 నిమిషాల్లో 92 ఆంగ్ల వాక్యాలు...

తలకిందులుగా చదివి కంచి బాలుడి రికార్డు



అశ్వంత్

చెన్నై, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఖతార్‌లోని ఓ పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న కాంచీపురానికి చెందిన బాలుడు బి.అశ్వంత్ (11) ఐదు నిమిషాల్లో 92 ఆంగ్ల వాక్యాలను తలక్రిందులుగా చదివి ప్రపంచ రికార్డు నెలకొల్పాడు. అశ్వంత్ తండ్రి, సివిల్ ఇంజనీర్ బాలసుబ్రమణ్యం, తల్లి విద్యాలక్ష్మి అన్నానగర్ ఈస్ట్‌లో నివసిస్తున్నారు. చిన్నప్పటి నుండి అశ్వంత్ ఆంగ్లభాషపై మంచి పట్టు సాధించాడు. ఖతార్‌లోని స్కూలులో శుక్రవారం ఉదయం ఉపాధ్యాయులు, నగర ప్రముఖుల సమక్షంలో 5 నిమిషాలలో 92 ఆంగ్లవాక్యాలను తలకిందులుగా చదివి ఇండియా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో స్థానం సంపాదించుకున్నారు. ఆ సంస్థ నిర్వాహకులు అశ్వంత్‌కు ధ్రువ పత్రం, జ్ఞాపిక అందించారు. ఈ విషయం గురించి తెలుసుకున్న అశ్వంత్ తల్లిదండ్రులు, బంధువులు అతడికి శుభాకాంక్షలు తెలియజేశారు.

కేంద్ర సర్వీస్‌కు దిండుగల్ డీఐజీ



డీఐజీ వందిత పాండే

ప్యారీస్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): దిండుగల్ డీఐజీగా పనిచేస్తున్న వందిత పాండేను కేంద్ర యువజన వ్యవహారాల శాఖ డైరెక్టర్‌గా కేంద్రప్రభుత్వం నియమించింది. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ప్రయాగ్‌రాజ్‌కు చెందిన వందిత పాండే 2011వ సంవత్సరం ఐపీఎస్ క్యాడర్‌లో ఎంపికై రాష్ట్రపోలీసు శాఖలో పలు పదవులలో రాణించి, ఉన్నతాధికారుల ప్రశంసలు పొందారు. 2016లో ఎస్పీగా పదోన్నతి పొందిన వందిత కరూర్ జిల్లాలో పనిచేసే సమయంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్లకు నగదు పంపిణీ చేసిన ఓ రాజకీయ నేత బినామీ ఇంట్లో రూ.4కోట్ల నగదు స్వాధీనం చేసుకున్నారు. అదే ఎన్నికల్లో కంటైనర్‌లో తరలించిన రూ.500 కోట్ల నగదును స్వాధీనం చేసుకోవడంలో ఈమె కీలకపాత్ర వహించారు. తిరుచ్చి డీఐజీ వరుణ్‌కుమార్‌ను వివాహం చేసుకున్న వందిత పాండే ప్రస్తుతం దిండుగల్ డీఐజీగా పనిచేస్తున్నారు. ఈమెను కేంద్ర సర్వీసుకు బదిలీ చేస్తున్నట్లు శనివారం ఉత్తర్వులు జారీ అయ్యాయి.

మూర్ఛ వ్యాధిపై అపోహలు

డాక్టర్ దినేష్ నాయక్



సమావేశంలో వైద్య నిపుణులు

చెన్నై, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): చికిత్సకు మించి, మూర్ఛతో సంబంధం వున్న కళంకాన్ని పరిష్కరించడం ఒక క్లిష్టమైన సవాలుగా మిగిలిపోయిందని, మూర్ఛపై అపోహలు ఎన్నో వున్నాయని గ్లెనీగల్స్ హాస్పిటల్ న్యూరాలజీ, ఎపిలెప్టాలజీ డైరెక్టర్, సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ దినేష్ నాయక్ పేర్కొన్నారు. ఈ అపోహలు మూర్ఛ రోగుల సామాజిక, వృత్తిపరమైన జీవితాలను ప్రభావితం చేస్తుందని వ్యాఖ్యానించారు. అయితే మూర్ఛపై విజయం సాధించిన వారు ఇతరుల మాదిరిగానే చురుకైన, సంతృప్తికరమైన జీవితాలను గడపగలరన్నారు. గ్లెనీగల్స్ హాస్పిటల్ మూర్ఛ వ్యాధిగ్రస్తుల జీవితాలను మార్చడంలో కీలక పాత్ర పోషించిందని ప్రశంసించారు. ప్రతి సంవత్సరం ఫిబ్రవరి రెండవ సోమవారం జరుపుకునే అంతర్జాతీయ మూర్ఛ దినోత్సవ కార్యక్రమం నగరంలోని గ్లెనీగల్స్ హాస్పిటల్లో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మూర్ఛ నుంచి కోలుకున్న వారిని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆర్.సుదన్, ప్రొఫెసర్ టీఎంఎన్ దీపక్, లయన్ మహబూబ్ బాషా, దీపా సాథే, గ్లెనీగల్స్ హాస్పిటల్ చెన్నై, హైదరాబాద్ క్లస్టర్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ కె.నాగేశ్వరరావు తదితరులు సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ దినేష్ నాయక్ ప్రసంగించారు. అనంతరం డాక్టర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ.. మూర్ఛ అనేది ఒక వ్యక్తి సామర్థ్యాన్ని లేదా భవిష్యత్తును నిర్వచించదని, మూర్ఛ వున్నవారు సాధారణ జీవితాన్ని గడపలేరనేది కేవలం అవాస్తవమని, సరైన వైద్యసహాయం వుంటే మూర్ఛ నుంచి బయటపడవచ్చన్నారు.

దమ్ముంటే నాపై పోటీకి రండి

● మాజీమంత్రికి మంత్రి పీకే శేఖర్‌బాబు సవాల్



కమ్యూనిటీ హాలు శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రి శేఖర్‌బాబు, మేయర్ ప్రియ తదితరులు

ప్యారీస్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): దమ్ముంటే హార్బర్ శాసనసభ నియోజకవర్గంలో నాతో పోటీకి సిద్ధమేనా అని అన్నాడీఎంకే సీనియర్ నేత, మాజీ మంత్రి ఎస్పీ వేలుమణికి హిందూ దేవాదాయ శాఖామంత్రి పీకే శేఖర్‌బాబు సవాలు విసిరారు. అయినావరంలోని ఆది సోమత్తమ్మన్ ఆలయ జీర్ణోద్ధారణ పనులను మంత్రి శేఖర్‌బాబు శనివారం పరిశీలించారు. అనంతరం ఆయన తిరువికనగర్ నియోజకవర్గ పరిధిలోవున్న పెరంబూరు చంద్రయోగి సమాధివీధిలో రూ.18.70కోట్లతో నిర్మించే కమ్యూనిటీ హాలుకు శంకుస్థాపన చేశారు. గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ ఆధ్వర్యంలో 74వ వార్డులో రూ.2.75కోట్లతో నిర్మించే డ్రైనేజీ పనులకు కూడా శంకుస్థాపన చేశారు. మంత్రితో పాటు మేయర్ ప్రియా, టీఎన్‌హెచ్‌బీ కార్యదర్శి కాకర్ల ఉషా, ఎమ్మెల్యే తాయగం కవి సహా ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పీకే శేఖర్‌బాబు మీడియాతో మాట్లాడుతూ, ఉత్తర చెన్నైలో నివసిస్తున్న ప్రజలకు ప్రభుత్వం తరుఫున మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు ముఖ్యమంత్రి స్టాలిన్ చర్యలు చేపట్టారన్నారు. 2026లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో హార్బర్ శాసనసభ నియోజకవర్గం నుండి తనపై పోటీ చేసేందుకు మాజీమంత్రి ఎస్పీ వేలుమణికి దమ్ముందా? అంటూ మంత్రి సవాల్ విసిరారు.

'అమ్మ మందుల దుకాణాలు మూసివేయం'

● సహకార శాఖ కార్యదర్శి డా.రాధాకృష్ణన్

పెరంబూర్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 'సీఎం ఫార్మశీ'లు ప్రారంభించినా 'అమ్మ మందుల దుకాణాలు' మూసివేయమని సహకార శాఖ కార్యదర్శి డా.రాధాకృష్ణన్ తెలిపారు. తిరుచ్చిలో శనివారం సీఎం ఫార్మశీ ఏర్పాటుపై ఆయన అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణన్ మాట్లాడుతూ... సీఎం ఫార్మశీలు ఈ నెలాఖరులో ప్రారంభించాలని నిర్ణయించామన్నారు. ఈ దుకాణాల్లో 186 రకాల నాణ్యమైన మందులు, సిద్ధ, హోమియోపతి మందులు లభిస్తాయని తెలిపారు. ఇప్పటివరకు 300 మందికి ప్రైవేటు వ్యక్తులు, 440 సహకార సంస్థలకు లైసెన్స్‌లు అందజేశామని, మరో 402 మందికి లైసెన్స్‌లు అందించనున్నామని తెలిపారు. అలాగే, రాష్ట్రవ్యాప్తంగా 898 దుకాణాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. తొలిరోజు చెన్నైలో లాంచనంగా ప్రారంభం కానున్న దుకాణాలు, మరుసటిరోజున రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమవుతాయని రాధాకృష్ణన్ తెలిపారు.

రాష్ట్రంలో 2,961 ఏనుగులు

పెరంబూర్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఏనుగుల సంఖ్య 2,961కి పెరిగిందని అటవీ శాఖ మంత్రి పొన్ముడి తెలిపారు. నగరంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్రంలో ఐదు శరణాలయాలు ఏర్పాటుచేసి ఏనుగులకు భద్రత కల్పిస్తున్నామన్నారు. అలాగే, ఏనుగులు జనావాస ప్రాంతాల్లోకి రాకుండా అడ్డుకొనేలా చర్యలు చేపట్టామన్నారు. ఏనుగుల ధ్వంసమైన పంటలకు సత్వరం పరిహారం అందిస్తున్నామన్నారు. దంతాల కోసం కొందరు ఏనుగులను హతమారుస్తున్నారని, అలాంటి చర్యలు అడ్డుకొనేలా అటవీ ప్రాంతాల్లో భద్రత పటిష్టం చేసినట్లు తెలిపారు. రోడ్లపై ఏనుగుల సహా జంతువులు సంచరించే సమయంలో వాహన చోదకులు అప్రమత్తంగా ఉండాలని, జంతువుల వద్దకు వెళ్లి సెల్ఫీ తీసుకోవడం, వాటి కదలికలు సెల్‌ఫోన్‌లో చిత్రీకరించడం తదితరాలు చేయరాదని మంత్రి విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వ ఉద్యోగులకు విపత్తుల నిర్వహణపై శిక్షణ



శిక్షణలో పరికరాల వివరాలు వివరిస్తున్న అధికారులు

పెరంబూర్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాల ఉద్యోగులకు విపత్తు నిర్వహణపై శిక్షణ ఇస్తున్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ లక్ష్మి భవ్య నేతృత్వంలో శుక్రవారం నుంచి ఈ శిక్షణ ప్రారంభమైంది. జిల్లాలో విపత్తులు అధికంగా జరిగే ప్రాంతాలు, ఆయా ప్రాంతాల్లో చేపట్టాల్సిన ముందస్తు చర్యలు, విపత్తుల్లో చిక్కుకున్న రక్షించడం తదితరాలు వివరించడంతో పాటు చేసి చూపించారు. అలాగే, విపత్తు నిర్వహణకు వినియోగించే పరికరాల గురించి ఉద్యోగులకు వివరించారు.

సింగపూర్ విమానంలో సాంకేతిక లోపం

పెరంబూర్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): చెన్నై నుంచి సింగపూర్ వెళ్లే విమానంలో సాంకేతిక లోపం కారణంగా ఐదు గంటలు ఆలస్యంగా బయల్దేరి వెళ్లింది. సింగపూర్ ఎయిర్‌లైన్స్ విమానం సింగపూర్ నుంచి బయల్దేరి రాత్రి 10 గంటలకు నగరానికి చేరుకొని, 11.25 గంటలకు నగరం నుంచి బయల్దేరి సింగపూర్ వెళుతోంది. ఈ విమానం ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ తదితర దేశాలకు కనెక్టింగ్ ఫ్లైట్ కావడంతో ప్రయాణికుల సంఖ్య అధికంగా ఉంటోంది. ఆ ప్రకారం శుక్రవారం రాత్రి ఈ విమానంలో వెళ్లేందుకు 264 మంది ప్రయాణికులు సిద్ధంగా ఉన్నారు. కానీ, రాత్రి 10 గంటలు ల్యాండింగ్ కావాల్సిన విమానం ఆలస్యంగా 10.26 గంటలకు విమానాశ్రయానికి చేరుకుంది. విమానం వద్దకు వెళ్లేందుకు ప్రయాణికులు సిద్ధమవుతున్న నేపథ్యంలో, విమానంలో సాంకేతిక లోపం తలెత్తడాన్ని అధికారులు గుర్తించారు. ఇంజనీరింగ్ నిపుణులు విమానం వద్దకు చేరుకొని సాంకేతికలోపం సరిచేయడంతో ఐదు గంటలు ఆలస్యంగా తెల్లవారుజామున 4.15 గంటలకు విమానం బయల్దేరి వెళ్లింది. సకాలంలో సాంకేతికలోపం గుర్తించడంతో 264 మంది ప్రయాణికులు, 12 మంది విమాన సిబ్బంది అని 276 మందికి ప్రమాదం తప్పిందని అధికారులు పేర్కొన్నారు.

ఉచిత ఇళ్ల పట్టాల పంపిణీ



ఇరుళర్ కుటుంబాలకు పట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్యే చంద్రన్

తిరుత్తణి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూర్ జిల్లా చెరకునూరు పంచాయతి బంగళామేడులో నివసిస్తున్న ఇరుళర్ కుటుంబాలకు ఎమ్మెల్యే చంద్రన్ ఇళ్ల పట్టాలు అందజేశారు. ఈ ప్రాంతంలో నివసిస్తున్న సుమారు 67 ఇరుళర్ కుటుంబాలు తాముంటున్న ఇళ్లకు పట్టాలు ఇవ్వాలని దీర్ఘకాలంగా అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ విషయమై స్పందించిన జిల్లా యంత్రాంగం వారికి ఇళ్ల పట్టాలు అందించాలని నిర్ణయించింది. శనివారం ఉదయం ఆర్డీవో దీప అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తిరుత్తణి ఎమ్మెల్యే చంద్రన్ పాల్గొని, లబ్దిదారులకు ఇళ్ల పట్టాలు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ మలర్‌వళి, డీఎంకే తిరుత్తణి తూర్పు మండల కార్యదర్శి రాజేంద్రన్, రెవెన్యూ శాఖ అధికారులు పాల్గొన్నారు.

మెక్సికో యువతితో తిరునల్వేలి యువకుడి వివాహం



నూతన దంపతులు అసువాణి లోబెస్ - ఇసైక్కిముత్తు

ప్యారీస్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలికి చెందిన ఇసైక్కిముత్తు మెక్సికో దేశానికి చెందిన అసువాణి లోబెస్‌ను ప్రేమించి వివాహం చేసుకున్నారు. తిరునల్వేలి శివానందపురంలో నివసిస్తున్న పశుపతి, అమ్మాపొన్ను దంపతుల కుమారుడు ఇసైక్కిముత్తు ప్రస్తుతం మెక్సికోలో పనిచేస్తున్నాడు. ఆయన ఆ దేశానికి చెందిన అసువాణి లోబెస్‌ను ప్రేమించి వివాహం చేసుకోవాలని తమ తల్లిదండ్రులకు తెలియజేశారు. వారు అంగీకారంతో మెక్సికోలోనే వివాహం చేసుకుని భర్త కోరిక మేరకు అతనితో కలిసి అసువాణి లోబెస్ తిరునల్వేలీలోని అత్తవారింటికి చేరుకున్నారు. శుక్రవారం హిందూ సంప్రదాయం ప్రకారం ఏర్పాటు చేసిన రిసెప్షన్‌కు హాజరైన బంధువులు శ్రేయోభిలాషులు నూతన దంపతులను ఆశీర్వదించారు. ఆశీస్సులందజేశారు. అనంతరం ఆ ప్రాంతంలోని పాపనాశం ఆలయంలో నూతన దంపతులు పూజలు చేశారు.

ఇండియా కూటమికి సమ్మెట పోటు

● అన్నాడీఎంకే చీఫ్ ఈపీఎస్



సేలం జిల్లా అన్నాడీఎంకే నిర్వాహకులతో సమావేశమైన ఈపీఎస్

ప్యారీస్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఇండియా కూటమికి ప్రజలు గుణపాఠం చెప్పారని ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి వ్యాఖ్యానించారు. సేలం జిల్లాలోని పలు పార్టీలకు చెందిన సుమారు 300 మందిపైగా కార్యకర్తలు శనివారం ఎడప్పాడి సమక్షంలో అన్నాడీఎంకేలో చేరారు. వారికి కండువా కప్పి, పార్టీలోకి సాదరంగా ఆహ్వానించిన సందర్భంగా ఈపీఎస్ మీడియాతో మాట్లాడుతూ, 2026లో రాష్ట్ర అసెంబ్లీకి జరగనున్న ఎన్నికల్లో అన్నాడీఎంకే నేతృత్వంలోని కూటమిని గెలిపించేందుకు కార్యకర్తలు ఇప్పటినుండే ప్రచారం చేపట్టాలని పిలుపునిచ్చారు. ఢిల్లీ అసెంబ్లీకు జరిగిన ఎన్నికల ఫలితాలు ఇండియా కూటమికి సమ్మెట పోటు లాంటిదన్నారు. తమ కూటమిలో చేర్చుకునే పార్టీల వివరాలను ఎన్నికల తేదీకి ముందే వెల్లడిస్తామన్నారు.

రేపు వడలూరులో తైపూసం ఉత్సవాల ప్రారంభం

ప్యారీస్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): కడలూరు జిల్లాలోని వడలూరులో సోమవారం ఉదయం పతాకావిష్కరణతో తైపూసం ఉత్సవాలు ప్రారంభకానున్నాయి. 11వ తేదీ ఏడు తెరలను తొలగించి జ్యోతిదర్శన వేడుక నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. కడలూరు జిల్లా వడలూరు సమీపంలోవున్న మరుదూర్‌లో జన్మించిన రామలింగఅడిగలార్ స్వామి ప్రజల్లో మతసామరస్యంపై అవగాహన కల్పించారు. దైవం జ్యోతి రూపంలో భక్తులను కటాక్షిస్తుంటాడని ఆయన ప్రపంచానికే బోధించారు. రాష్ట్రంలోని పలుప్రాంతాల్లో ధర్మసత్రాలు నిర్మించారు. మేట్టుకుప్పం ప్రాంతంలో అడిగలార్ తనువు చాలించిన ప్రాంతం నేడు పుణ్య క్షేత్రంగా విరాజిల్లుతోంది. ఈ ఏడాది 154వ వార్షిక తైపూసం సోమవారం ఉదయం 5గంటలకు పతాకావిష్కరణతో తైపూసం ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. మంగళవారం ఉదయం 6గంటల నుండి సాయంత్రం 5.30 గంటల వరకు జ్యోతి దర్శనానికి ఏర్పాట్లుచేశామని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

విద్యార్థినికి లైంగిక వేధింపులు

● ప్రొఫెసర్ అరెస్ట్

ప్యారీస్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): విల్లుపురం జిల్లాలో డిగ్రీ చదువుతున్న విద్యార్థిని ప్రొఫెసర్ దగ్గరకు ట్యూషన్ కోసం వెళ్తోంది. దీన్ని తనకు అనుకూలంగా తీసుకున్న ప్రొఫెసర్ ఈ నెల 5వ తేదీ రాత్రి 9గంటలకు వీడియో కాల్ ద్వారా ఆ విద్యార్థినికి నగ్నచిత్రాలు చూపించి, అసభ్యకరంగా ప్రవర్తించడంతో పాటు, లైంగికవేధింపులకు గురిచేసినట్లు తల్లిదండ్రుల దగ్గర విద్యార్థిని మొరపెట్టుకుంది. ఆమె తల్లిదండ్రుల ఫిర్యాదు ఆధారంగా దిండివనం పోలీసులు పోక్సో చట్టం కింద శనివారం ప్రొఫెసర్‌ను అరెస్ట్ చేసి అతడి సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

లైంగిక వేధింపుల కేసులో యువకుడికి 35 ఏళ్ల జైలు

పెరంబూర్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన యువకుడికి 35 ఏళ్ల జైలుశిక్ష విధిస్తూ న్యాయస్థానం తీర్పు వెలువరించింది. ధర్మపురి జిల్లా ఆరూర్ అమ్మాపాళయం ప్రాంతానికి చెందిన కుబేంద్రన్ (29) అవినాశి ప్రాంతంలో బసచేస్తూ బనియన్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. 2019లో ఓ బాలికను వివాహం చేసుకుంటానని నమ్మించి లైంగిక వేధింపులకు పాల్పడినట్లు తెలిసింది. ఈ విషయమై బాధితురాలి తల్లిదండ్రులు అవినాశి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంపై పోక్సో, అంటరానితనం నిరోధక చట్టాల కింద కేసు నమోదుచేసిన పోలీసులు కుబేంద్రన్‌ను అరెస్ట్ చేశారు. ఈ కేసులో వాదోపవాదాలు పూర్తికావడంతో, నిందితుడికి 35 ఏళ్ల జైలు, రూ.15 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి సురేష్ శుక్రవారం తీర్పు వెలువరించారు.

లారీ ఢీకొని భర్త కళ్లముందే మహిళ మృతి

ప్యారీస్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): సినిమా చూసేందుకు బైక్‌పై వెళ్తున్న సమయంలో లారీ ఢీకొనడంతో భర్త కళ్ళముందే భార్య మృతిచెందిన సంఘటన శుక్రవారం సాయంత్రం వానగరం ప్రాంతంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు తిరువర్కాడు గణపతినగర్‌కు చెందిన పెరుమాళ్ (55), ఇసక్కియమ్మాళ్ (50) దంపతులు శుక్రవారం సాయంత్రం కోయంబేడులో ఉన్న రోహిణి థియేటర్‌లో అజిత్ నటించిన విడాముయర్చి సినిమా చూసేందుకు ఇంటి నుండి ద్విచక్ర వాహనంలో బయలుదేరారు. వారు వానగరం సిగ్నల్ వద్ద కుడివైపు తిరిగేందుకు ప్రయత్నిస్తూ బైక్ నుండి జారీ కిందపడ్డారు. ఆ సమయంలో వెనుక నుండి వస్తున్న ఇసుక లారీ ఇసక్కియమ్మాళ్‌పై ఎక్కిడిగింది. ఆమె భర్త కళ్ళముందే సంఘటనా స్థలంలోనే మృతిచెందగా, పెరుమాళ్ స్వల్పగాయాలతో బయటపడ్డాడు. కోయంబేడు ట్రాఫిక్ విభాగం పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన

● బుస్సీ ఆనంద్‌కు రూ.1000 జరిమానా

ప్యారీస్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): బైక్ ర్యాలీలో హెల్మెట్ ధరించని తమిళగ వెట్రి కళగం (టీవీకే) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్‌కు ట్రాఫిక్ పోలీసులు రూ.1000 జరిమానా విధించారు. టీవీకే ఆధ్వర్యంలో టి.నగర్‌లో నిర్మించిన పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవం ఇటీవల జరిగింది. ఈ సందర్భంగా జరిగిన బైక్ ర్యాలీలో హెల్మెట్ లేకుండా బుస్సీ ఆనంద్ బైక్ నడిపారు. అంతేకాకుండా ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించి వన్‌వేలో ఈ ర్యాలీ సాగింది. దీనిపై మాంబలం ట్రాఫిక్ పోలీసులు బుస్సీ ఆనంద్ ప్రయాణం చేసిన ద్విచక్ర వాహన రిజిస్ట్రేషన్ నెంబరు ఆధారంగా రూ.1000 జరిమానా విధించినట్లు పోలీసులు తెలిపారు.



'ఎస్‌టీఆర్50' ఫస్ట్‌లుక్

ఆ రిస్క్ నేనే భరిస్తా : హీరో శింబు

తమిళ చిత్రజ్యోతి

హీరో శింబు నటించే 50వ చిత్రాన్ని తాజాగా ప్రకటించారు. తన బర్త్‌డేను పురస్కరించుకుని ఈ ప్రాజెక్టుపై అధికారికంగా ప్రకటించారు. దేశింగు పెరియస్వామి దర్శకత్వంలో ఆత్మాన్ సినిమా ఆర్ట్స్‌ను హీరో శింబు సొంతంగా స్థాపించి ఈ మూవీని తెరకెక్కించనున్నారు. నిజానికి ఈ ప్రాజెక్టును అగ్రనటుడు కమల్ హాసన్ తన సొంత బ్యానర్ రాజ్ కమల్ ఫిల్మ్ ఇంటర్నేషనల్ (ఆర్‌కేఎఫ్‌ఐ) పతాకంపై నిర్మించనున్నట్టు మొదట ప్రకటించారు. అయితే, ఉన్నట్టుండి ఇపుడు శింబు స్వయంగా నిర్మించనున్నట్టు ప్రకటించారు. దీనికి కారణం లేకపోలేదు. వాస్తవానికి ఈ స్టోరీని దర్శకుడు దేశింగు పెరియస్వామి ముందుగా సూపర్‌స్టార్ రజనీకాంత్‌కు చెప్పగా, భారీ బడ్జెట్ అవుతుందని చెప్పి సున్నితంగా తిరస్కరించారు. ఆ తర్వాత కమల్‌కు వివరించగా శింబు హీరోగా తెరకెక్కించేందుకు అంగీకరించారు. కానీ, ఇపుడు కమల్ కూడా తప్పుకున్నారు. దీనిపై శింబు మాట్లాడుతూ 'ఇది భారీ బడ్జెట్ మూవీ. పెద్ద రిస్క్‌తో కూడుకున్న పని. ఇతరులతో అంత రిస్క్ చేయించడం భావ్యంకాదు. అందుకే ఆ రిస్క్ నేనే తీసుకోవాలని నిర్ణయించాను' అని పేర్కొన్నారు. త్వరలోన ఈ మూవీ ప్రోమో షూట్ చేయనున్నట్టు వివరించారు.

అత్యున్నత సినిమాలో ఓ భాగమవుతా

● సంజనా నటరాజన్



అత్యున్నత సినిమాలో ఒక భాగమవుతానని యువ హీరోయిన్ సంజనా నటరాజన్ అంటున్నారు. ఫ్యాషన్ వరల్డ్ నుంచి సినిమా ప్రపంచంలోని అడుగుపెట్టిన ఈమె.. 'నెరుంగి వా ముత్తమిడాదే' అనే సినిమా ద్వారా వెండితెరకు పరిచయమయ్యారు. ఆ తర్వాత 'ఇరుదిచుట్రు', 'జగమే తందిరం', 'సర్పట్టా పరంబరై', 'జిగిర్‌తండా డబుల్ ఎక్స్' వంటి పలు చిత్రాల్లో చిన్నచిన్న పాత్రలు పోషించారు.. ఇటీవల విడుదలైన 'బాటల్ రాధ' మూవీలో హీరో గురుసోమసుందరం భార్యగా నటించి తొలిసారి హీరోయిన్‌గా అవకాశాన్ని దక్కించుకున్నారు. ఇందులో ఆమె నటనకు మంచి మార్కులేపడ్డాయి. దీనిపై ఆమె మాట్లాడుతూ, "బాటల్ రాధా' మూవీలో నా పాత్రకు ప్రతి ఒక్కరి నుంచి ప్రశంసలు రావడం నిజంగా ఎంతో సంతోషిస్తున్నాను. అందంగా, యదార్థంగా, సహజసిద్ధంగా రాసిన కథాపాత్రకు నా మీద నమ్మకంతో ఎంపిక చేసినందుకు దర్శక నిర్మాత, ఇతర చిత్ర బృందం సభ్యులకు, ప్రేక్షకులకు హృదయపూర్వక ధన్యవాదాలు. అభిమానుల ప్రేమ, ఆదరణ నన్ను మరింతగా ప్రోత్సహిస్తుంది. భవిష్యత్‌లో సత్ప్రవర్తనతో అత్యున్నత సినిమాలో ఓ భాగమయ్యేందుకు ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నాను' అని పేర్కొన్నారు.

సినిమాల్లోకి రావడానికి కారణం ఆయనే

● దర్శకుడు రాజ్‌కుమార్ పెరియస్వామి



తాను సినిమాల్లోకి రావడానికి స్టార్ డైరెక్టర్ మణిరత్నం ప్రధాన కారణమని 'అమరన్' చిత్ర దర్శకుడు రాజ్‌కుమార్ పెరియస్వామి వెల్లడించారు. తాజాగా మణిరత్నంతో కలిసి దిగిన ఫొటోను ఆయన సోషల్ మీడియాలో షేర్ చేస్తూ, 'నేను చిత్రపరిశ్రమలోకి అడుగుపెట్టడానికి ముఖ్య కారణం మణిరత్నం. ఆయనతో కలిసి 2005లో దిగిన ఫొటో ఎక్కడో మిస్ అయింది. ఆయనతో మళ్ళీ ఫొటో తీసుకునేందుకు రెండు దశాబ్దాలు, రెండు చిత్రాలు అవసరమయ్యాయి. 'అమరన్' మూవీ కోసం మీరిచ్చిన ప్రోత్సాహం మరువలేనిది' అని పోస్ట్ చేశారు. కాగా, శివకార్తికేయన్, సాయిపల్లవి జంటగా నటించిన అమరన్ చిత్రం విడుదలై వంద రోజులకు చేరువకానుంది. ఇప్పటివకే ఈ మూవీ రూ.400 కోట్లకుపైగా వసూలు చేసి, 2024లో బ్లాక్‌బస్టర్ హిట్ మూవీల్లో ఒకటిగా నిలిచిన విషయం తెల్సిందే.

డెబ్యూ డైరెక్టర్ దర్శకత్వంలో దిగ్గజ దర్శకుడు



భారతీరాజా

దిగ్గజ దర్శకుడు భారతీరాజా నూతన దర్శకుడు బ్రిట్టో జేపీ దర్శకత్వంలో నటిస్తున్నారు. ఈ చిత్రానికి 'నిరం మారుమ్ ఉలగిల్' అనే టైటిల్ ఖరారు చేశారు. ఇందులో నట్టి నటరాజ్, రియోరాజ్, శాండి, సురేష్ మేనన్, ఆడుగలం నరేన్, మైమ్ గోపి, వడివుక్కరసి, విఘ్నేష్‌కాంత్, కనిక, ఆదిరా తదితరులు నటించారు. సిగ్నేచర్ ప్రొడక్షన్స్ పతాకం, జీఎస్ సినిమాస్ ఇంటర్నేషనల్స్ సంయుక్తంగా నిర్మించాయి. జీవితంలో బంధుత్వాల ఆవశ్యకతతో పాటు షేడ్స్ ఆఫ్ ఎమోషన్స్‌ను ఈ చిత్రంలో వివరించనున్నారు. మార్చి 7వ తేదీ విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇందులో నటీనటుల పాత్రలను వివరిస్తూ ఓ పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఇందులో భాగంగా నా.ముత్తుకుమార్ అనే పాత్రలో యోగిబాబు నటించగా, అబ్దుల్ మాలిక్‌గా నట్టి, మలర్‌గా కావ్య అరివుమణి, అభి పాత్రలో లవ్లీ చంద్రశేఖర్, విజిగా విజి చంద్రశేఖర్ నటించారు.



పుష్ప ప్రదర్శన ప్రారంభిస్తున్న మంత్రులు పన్నీర్‌సెల్వం, సెంథిల్ బాలాజి, కలెక్టర్ క్రాంతికుమార్ తదితరులు

కోవై పుష్ప ప్రదర్శన ప్రారంభం



పూలతో రూపొందించిన చదువుల తల్లి

పెరంబూర్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూర్ తమిళనాడు వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో 7వ పుష్ప ప్రదర్శన ప్రారంభమైంది. కోవై బొటానికల్ గార్డెన్‌లో శనివారం ఉదయం జరిగిన కార్యక్రమంలో మంత్రులు సెంథిల్ బాలాజి, ఎమ్మార్కే పన్నీర్‌సెల్వం, కోవై జిల్లా కలెక్టర్ క్రాంతి కుమార్ పాడి, వర్సిటీ ప్రొ చాన్సలర్ దక్షిణామూర్తి, ఉప కులపతి సీతాలక్ష్మి పుష్ప ప్రదర్శన ప్రారంభించారు. ఈ ప్రదర్శనలో లక్షలాది పూలతో పలు రకాలైన చిత్రాలు రూపొందించారు. ఐదు రోజులు ఈ ప్రదర్శన జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.



శనివారం చెన్నై చేట్‌పేట్‌లో ఉన్న ఎంసీసీ స్కూల్‌లో జరిగిన రోబోక్వెస్ట్ ఎగ్జిబిషన్ తిలకిస్తున్న విద్యార్థులు

విభిన్న రంగాల్లో విశేష సేవలు

SUNDAY SPECIAL

ఎంతో నిష్టతో చేసే సత్యనారాయణ స్వామి వ్రతాన్ని ప్రతి నెలా వందలాదిమందితో కలిసి నిర్వహించడమంటే సామాన్య విషయం కాదు. అలాంటిది ఆ దీక్షను గత 56 ఏళ్లుగా నిర్వహిస్తోంది చెన్నైలోని పొన్నూరు వారి కుటుంబం. ఒక పక్క సామాజిక సేవ, మరో పక్క రాజకీయాల్లో నిత్యం బిజీగా వుంటూనే ఆధ్యాత్మిక సేవలోనూ రాణిస్తున్న ఆర్యవైశ్య ప్రముఖులు పొన్నూరు రంగనాయకులుతో 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక ముఖాముఖి..

- చెన్నై, ఆంధ్రజ్యోతి

56 ఏళ్లుగా 'సత్యనారాయణ వ్రత దీక్ష'

సామాజిక సేవ.. రాజకీయాల్లో రాణిస్తున్న తెలుగుబిడ్డ రంగనాయకులు



విమానాశ్రయంలో ప్రధాని మోదీకి స్వాగతం పలుకుతున్నప్పటి చిత్రం



జై ఆంధ్ర ఉద్యమంలో రంగనాయకుల తల్లిదండ్రులు

సామాజిక సేవా కుటుంబం...

మా నాన్నగారు పొన్నూరు వెంకటేశ్వర్లు, అమ్మ సీతమ్మ. నాన్నగారు ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పని చేసేవారు. అప్పట్లో ఆయన ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర సాధన కోసం చెన్నైలో జరిగిన ఉద్యమంలో పాల్గొన్నారు. ఆయనతో పాటు మా అమ్మ, పెద్దనాన్న, కుటుంబమంతా ఆందోళనల్లో పాల్గొనేది. అప్పట్లో మా ఇల్లు ప్యారీస్‌లో ఉండేది. మా ఇంటి వద్దనే పొట్టి శ్రీరాములు అద్దెకు ఉండేవారు. ఆయనతో మా కుటుంబం ఎంతో సన్నిహితంగా ఉండేది. ఆయన ప్రభావం మా కుటుంబంపైనా అధికంగా ఉండేది. ఆ ప్రభావంతోనే మా కుటుంబం మొత్తం 70వ దశకంలో ప్రత్యేక ఆంధ్ర సాధన కోసం కేసులకు కూడా భయపడకుండా ఉద్యమాలు, అందోళనలు చేపట్టింది. అప్పట్లోనూ రాష్ట్రంలోని తెలుగు పాఠశాలల పట్ల వివక్ష ఉండేది. దాంతో తెలుగు విద్యార్థుల సంఖ్య తక్కువగా వున్న తరగతులను, స్కూళ్లను మూసేసేవారు. దాంతో కొంతమంది విద్యార్థులు తెలుగునైనా వదులుకోవాల్సి వచ్చేది, లేదా పాఠశాలనైనా మూసివేసేవారు. అలాంటప్పుడు మా నాన్నగారు ఆయా విద్యార్థుల ఇళ్లకు వెళ్లి, తానే స్వయంగా ఫీజు కట్టి, తెలుగు అందుబాటులో వున్న పాఠశాలలో చేర్పించేవారు. నాన్న తెలుగు వారి కోసం, తెలుగు సంఘాల కోసం, తెలుగు జాతి కోసం తనకు వీలైనంతగా కృషి చేసేవారు. ఆయన ప్రభావం నాపై వుంది. ఆ కారణంగానే చిన్నప్పటి నుంచి సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నాను.



వ్రతదీక్షలో పొన్నూరు రంగనాయకులు

56 ఏళ్లుగా సత్యనారాయణ వ్రతం...

నాన్నగారికి విపరీతమైన భక్తి. సత్యనారాయణ వ్రతం చేస్తే మంచి జరుగుతుందని ఓ స్వామీజీ చెప్పారు. ఆయన చెప్పింది నిజమైంది. అప్పటి నుంచి ప్రతి నెలా నాన్నగారు ఇంట్లో సత్యనారాయణ వ్రతం చేసేవారు. ఆయన 2012లో కన్నుమూశారు. మేము దానిని కొనసాగిస్తున్నాం. నేను పుట్టడానికి రెండేళ్ల ముందు నుంచే మా ఇంట ఈ వ్రతదీక్ష ప్రారంభమైంది. ప్రతి నెలా వ్రతానికి 50 నుంచి వంద మంది వరకు వస్తుంటారు. వారందరికీ ప్రసాదం, భోజనాలు కల్పిస్తాం. మా ఇంట జరిగే వ్రతానికి ఎంతోమంది హేమాహేమీలు హాజరయ్యారు. ఎంతోమంది అవివాహితులు వచ్చి ఈ వ్రతంలో పాల్గొంటుంటారు. మా నాన్నగారి మాట మేరకే నేను ఈ వ్రతం కొనసాగిస్తున్నాను. 'ప్రపంచ ఆర్యవైశ మహాసభ' ఆధ్వర్యంలో కొన్నిమార్లు వేలాదిమందితో సామూహిత వ్రతాలు చేశాం. దానికి బీజం మా ఇంటి వ్రత అంశమే.

పుట్టి పెరిగింది ఇక్కడే...

మా పూర్వీకులది ప్రకాశం జిల్లా ఈతముక్కల. మా నాన్నగారు చిన్నప్పుడే చెన్నై వచ్చేశారు. నేను పుట్టిపెరిగింది ఇక్కడే. ప్యారీస్‌లోని ఎస్‌కేపీడీ స్కూల్లో ప్రాథమిక, మాధ్యమిక విద్యాభ్యాసం పూర్తయింది. బీకాం తురైపాక్కంలోని డీబీ జైన్ కాలేజీలో చేశాను. తరువాత ఎంకామ్, బీఎడ్, ఎంఎడ్, ఎంఫిల్ మద్రాస్ యూనివర్సిటీలో చేశాను. రియల్ ఎస్టేట్ వ్యాపారంతోనే నా జీవితం ప్రారంభించాను. కొన్ని డబ్బింగ్ సినిమాలు కూడా చేశాను. కొన్ని థియేటర్లు లీజుకు తీసుకుని నడిపాను. భార్య అనూరాధ, ఒక అబ్బాయి సాయిచేతన్, అమ్మాయి హర్షిణి.



కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో..



రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో..



రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో..

రాజకీయ జీవితం...

సిద్ధాంతాలు నచ్చడంతో 1994లో బీజేపీలో చేరాను. బూత్ స్థాయిలో ప్రారంభమైన నా రాజకీయ జీవితంలో ఎన్నో పదవులు చేసాను. ప్రస్తుతం బీజేపీ రాష్ట్ర ప్రచార విభాగ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నాను. పదవులేవీ ఆశించలేదు. పార్టీ ఏం చెబితే అది చేయడమే నా బాధ్యత. ఇల గణేశన్, పొన్ రాధాకృష్ణన్, సీపీ రాధాకృష్ణన్, తమిళిసై, మురుగన్, అన్నామలై వంటి నేతలందరితోనూ కలిసి పని చేశాను, చేస్తున్నాను. ప్రచార విభాగాధ్యక్షుడిగా అన్నామలై నన్ను నియమించారు. భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడే నాకు స్ఫూర్తి. ఆయనకున్న భాషలపై పటుత్వం, అనర్గళమైన సంభాషణ, సమాజంపై అవగాహన, పరిమితి మేరకు నడచుకోవడం వంటివన్నీ నాకెంతో స్ఫూర్తి దాయకం.

ఎన్నో సేవా కార్యక్రమాలు...

మా నాన్నగారి ప్రభావం నాపై వుంది. అందుకే చిన్నప్పటి నుంచే సేవా కార్యక్రమాల్లో విస్తృతంగా పాల్గొనేవాడిని. ఎన్నో తెలుగు సంఘాల ద్వారా తెలుగు భాషకు, తెలుగు ప్రజలకు నా వంతు సేవలందించాను. ఆర్యవైశ్య సంఘాలన్నింటిలోనూ నేను ఏదో ఒక బాధ్యతల్లో వున్నాను. తమిళనాడు ఆర్యవైశ్య మహాసభకు ఉపాధ్యక్షుడిగా, ఆ మహాసభ చెన్నై విభాగానికి ఉపాధ్యక్షుడిగా పని చేశాను. దక్షిణ భారత తెలుగు సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శిగానూ వ్యవహరించాను. ఫిలిం ప్రొడ్యూసర్స్ గిల్డ్ కమిటీలో 20 ఏళ్లుగా వున్నాను. రైల్వే శాఖ జోనల్ కమిటీలో వున్నాను. ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ గ్లోబల్ కో-ఆర్డినేటర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నాను. ఆ మహాసభ అధ్యక్షుడు తంగుటూరి రామకృష్ణ నేతృత్వంలో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించాం. 1988లో 'మెడ్రాస్ యునైటెడ్ వెల్ఫేర్ అసోసియేషన్' ప్రారంభించాం. అప్పట్లోనే ఎన్నో శిబిరాలు నిర్వహించాం. 'ఇండియన్ సుఖ సేవా అసోసియేషన్' పెట్టాం. దాని ద్వారా రాష్ట్రంలోని కొన్ని వందల ఆలయాలను శుభ్రం చేశాం. అది 'స్వచ్ఛ భారత్' కార్యక్రమం లాంటిది. 2000 సంవత్సరంలోనే ఎన్నో ఆలయాలను శుభ్రం చేశాం.



రంగనాయకులుతో భార్య, కుమార్తె, కుమారుడు, కోడలు

తెలుగువాడినే

నా మాతృభాష తెలుగే అని నేను ఎక్కడైనా గర్వంగా చెబుతాను. ఇది రాజకీయాల్లో నాకు కొంత ఇబ్బంది కల్గించవచ్చు. అయినా నేను వెరవను. నాకు తెలుగుతో పాటు తమిళం, సంస్కృతం, ఆంగ్లం, హిందీ భాషలు వచ్చు. అన్నీ చదువుతాను, రాస్తాను, మాట్లాడతాను. ఇదే నన్ను పార్టీ ప్రచార అధ్యక్షుడిగా అవకాశం రావడానికి కారణమైంది. రాష్ట్రంలో 40 శాతం మంది తెలుగువారున్నా, రాజకీయాల్లో సరైన గుర్తింపు లేదన్నది నా ఉద్దేశం. తెలుగువారమని చెప్పుకోవడానికి కూడా కొంతమంది భయపడుతున్నారంటేనే పరిస్థితి అవగతమవుతుంది.



అవార్డు గ్రహీతలతో అతిథులు, నిర్వాహకులు

ఘనంగా ప్రతిభా పురస్కార ప్రదానోత్సవం

ప్యారీస్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కేటీసీటీ బాలికల పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాలు - 2025 ప్రదానోత్సవం శనివారం ఘనంగా జరిగింది. జార్జ్‌టౌన్ ఆదియప్పనాయకన్ వీధిలోవున్న ఎస్కేపీసీ ఎన్వెంక్షన్ హాలులో ఉదయం 10గంటలకు వాసవీ మాత పూజ, జ్యోతిప్రజ్వలనంతో ప్రారంభమైన ఈ వేడుకలకు అసోసియేషన్ అధ్యక్షురాలు చంద్రగిరి లతా బాలాజీ సారథ్యం వహించారు. తమ అసోసియేషన్ నిర్వాహకులు, సభ్యులు, దాతల సహకారంతో సమాజానికి తమ వంతు సహాయం అందజేస్తున్నట్లు తెలిపారు. పలు రంగాల్లో రాణిస్తున్న వారిని ఎంపిక చేసి ప్రతిభ పురస్కారాలతో సత్కరించుకుటున్నట్లు లతా బాలాజీ తెలిపారు. కార్యదర్శి నేరెళ్ల మాలతీ సంతోష్ సంస్థ తరుపున ప్రతి ఏటా చేపడుతున్న సేవా కార్యక్రమాలు, అమలుపరుస్తున్న పథకాలను వివరించారు. ట్రెజరర్ భాను సుబ్రమణ్యం, అసోసియేషన్ సభ్యుల పర్యవేక్షణలో సాగిన ఈ కార్యక్రమంలో విద్యార్థినులు ప్రదర్శించిన నృత్యం, ఫ్యాషన్ షో ఆకట్టుకున్నాయి. ముఖ్య అతిథిగా లయన్ టి.రమేష్‌బాబు, గౌరవ అతిథిగా వాసవీ క్లబ్స్ జిల్లా గవర్నర్ సీఎం రాజేష్, ఆత్మీయఅతిథిగా ఎస్కేపీడీ ట్రస్టీ ఊటుకూరు శరత్‌కుమార్, కేటీసీటీ పాఠశాలల టీచర్లు, విద్యార్థునులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ముగ్గురు సీనియర్ సిటిజన్ సభ్యులకు 'వనితా కిషోరం', నలుగురు టీచర్లకు 'గురుదేవో భవ', 70ఏళ్ల సీనియర్ సిటిజన్లు పురస్కారాలు, వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. అదేవిధంగా కేటీసీటీ బాలికల మహోన్నత పాఠశాలకు రూ.25వేల విలువైన రెండు స్టీల్ అలమరాలు విరాళంగా అందజేశారు.

ప్రాణ సంరక్షకులకు ఏబీఏ అవార్డులు



మంత్రి సుబ్రమణ్యంతో పురస్కార గ్రహీతలు, నిర్వాహకులు

చెన్నై, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): వివిధ సమయాల్లో పలువురి ప్రాణాలను సంరక్షించిన 14 మంది రియల్ హీరోలను 'అలర్ట్ బీయింగ్ అవార్డ్ (ఏబీఏ) వరించాయి. శనివారం చెన్నైలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం, ఇస్రో శాస్త్రవేత్త పద్మభూషణ్ డాక్టర్ ఎ.శివథాను పిళ్లై పురస్కారాలు అందజేశారు. వయనాడ్ కొండచరియలు విరిగిపడినప్పుడు బాధితులను ఆదుకునేందుకు తన ప్రాణాలను పణంగా పెట్టిన నీలగిరికి చెందిన నర్సు సబీనా, వయనాడ్ విపత్తు సమయంలో 31 గంటల్లోనే బెయిలీ వంతెన నిర్మించిన బృందానికి నేతృత్వం వహించిన మేజర్ సీతా షెల్కే తదితరులు ఈ పురస్కారాలు అందుకున్నవారిలో వున్నారు. ఈ సందర్భంగా ఏబీఏ ఛైర్మన్ షైక్ మురళీధరన్ మాట్లాడుతూ.. విపత్తుల సమయంలో ప్రాణాలను కాపాడేందుకు కోటి మంది వాలంటీర్లను తయారు చేయాలని భావిస్తున్నామన్నారు. సంస్థ వ్యవస్థాపక ట్రస్టీ కళా బాలసుందరం, సహ వ్యవస్థాపకుడు, మేనేజింగ్ ట్రస్టీ రాజేష్ ఆర్ త్రివేది తదితరులు పురస్కార గ్రహీతలను అభినందించారు.



జనవరి 31న మైసూరు ఎక్స్‌ప్రెస్ రైలులో ఓ ప్రయాణికుడు పోగొట్టుకున్న నగదును పోలీసులకు అప్పగించిన చెన్నై నందనం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు విఘ్నేష్, మాధవన్, ఇరా జీవానందంకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న మంత్రులు ఎం.సుబ్రమణ్యం, కొవి చెళియన్



అలిపిరి పాదాలమండపం కిటకిట

వరుస సెలవులకు తోడు రెండవ శనివారం అలిపిరి పాదాల మండపం భక్తులతో కిటకిటలాడింది. శనివారం పాదాల మండపం దర్శిస్తే శ్రీవారిని చూసినట్టేనని భక్తులు భావిస్తుంటారు. ఈ క్రమంలోనే సాయం సంధ్య వేళ ఆహ్లాదకర వాతావరణంలో భారీగా భక్తులు పాదాలమండపం వద్దకు చేరుకున్నారు. పండితలిగ, దీపారాధన సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం పక్కనే ఉన్న గోశాలను సందర్శించారు. ఇతర ప్రాంతాల వచ్చిన భక్తులు, స్థానికులు కలవడంతో కొబ్బరికాయల సమర్పణ ప్రాంతం కూడా కిక్కిరిసింది. దారిపొడవునా ఇరువైపులా ద్విచక్రవాహనాల పార్కింగ్ చాంతాడులా వ్యాపించింది. దీంతో గరుడ కూడలి వద్ద పలుమార్లు ట్రాఫిక్ స్తంభించింది. సెక్యూరిటీ సిబ్బంది అప్రమత్తమయ్యారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకొన్నారు. ఆ ప్రాంతమంతా గోవిందనామస్మరణలు మార్మోగింది.

- తిరుపతి అర్బన్, ఆంధ్రజ్యోతి





శ్రీవారి సర్వదర్శనానికి 18 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 18 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని కంపార్టుమెంట్లు నిండిపోయి క్యూలైన్ టీబీసీ వరకు వ్యాపించింది. ఇక వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

గురువారం నాటి హుండీ ఆదాయం: రూ.2.99 కోట్లు

శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 62,971

తలనీలాలు సమర్పించిన వారు: 24,439






చుట్టూ వనం..

ఎంచక్కా భోజనం

- అడవి సెట్టింగుల మధ్య అనుభూతుల విందు





కంగారు పడకండి..ఇదేంటి అడవిలో భోజనం చేస్తున్నారేంటనుకుంటున్నారా.. మీరే కాదు ఎవరైనా అలా భావించాల్సిందే. ఇక్కడకు వస్తే అచ్చం అడవిని తలపించే వాతావరణమే. కాలానుగుణ అభిరుచుల్లో ఇదొకటి. కొందరికి సరదాగా అటవీ ప్రాంతంలో భోజనం చేయాలనే కోరిక ఉంటుంది. అలాగని అడవికి పోలేం కదా..అందుకే అలాంటి వాతావరణాన్ని కృత్రిమంగా సృష్టించి ఆహారప్రియులకు ఆకట్టుకుంటోంది కపిలతీర్థం సమీపంలోని పై వైస్‌రాయ్ హోటల్. పచ్చని చెట్ల పందిరి, పక్షులు, జంతువుల రూపాల సెట్టింగుల మధ్య తింటుంటే అదే ఫీలింగ్ కలుగుతుంది. ఇందులోని గుహ రెస్టారెంట్‌లో అడుగుపెట్టగానే గుహపై పెద్ద పులి నిద్రిస్తున్నట్లు కనపిస్తుంది. రాజుల కాలం మాదిరిగా ఇద్దరు భటుల విగ్రహాలు ఆరంభంలోనే ఆకర్షిస్తాయి. లోపలకు వెళతుంటే అడవిలో అడుగుపెడుతున్న అనుభూతి కలుగుతుంది. అటవీశాఖ యూనిఫారం తరహాలోనే సిబ్బంది దుస్తులు వేసుకుంటారు. ముత్యాల స్పెషల్ మటన్ బిరియాని, మటన్ ఫ్రై, మెంతాకు కోడి వేపుడు, టైగర్ చికెన్ ఇలా చికెన్‌లో వంద రకాలు, మటన్‌లో 50 రకాలు, ఫిష్‌లో 50, ప్రాన్స్‌లో 20 రకాల వంటకాలను ఆస్వాదించవచ్చు. శాఖాహారుల కోసం గ్రౌండ్ ఫ్లోర్‌లో ప్రత్యేకంగా భోజనం ఉంటుంది. పిల్లల కోసం ఓ ఆటల గది కూడా ఏర్పాటు చేశారు.



- తిరుపతి(వైద్యం)



సవిత - విజయభారతి - శోభారాజ్

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు.వారిలో రాష్ట్ర మంత్రి సవిత, నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ సభ్యురాలు విజయభారతి, ప్రముఖ గాయని శోభారాజ్, పూతలపట్టు ఎమ్మెల్యే మురళీ మోహన్ ఉన్నారు. వీరికి ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.

పదవ తరగతి పరీక్షలకు కసరత్తు ప్రారంభం

తిరుపతి(విద్య), ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పదవ తరగతి పరీక్షల నిర్వహణకు కసరత్తు ప్రారంభమైంది. మార్చి 17 నుంచి జరగనున్న ఈ పరీక్షలపై జిల్లా విద్యాశాఖాధికారి కేవీఎన్ కుమార్ ఫోకస్‌పెట్టారు. 310 ప్రభుత్వ పాఠశాలల నుంచి 15,455 మంది, 266 ప్రైవేటు పాఠశాలల నుంచి 11,548 మంది పరీక్షలకు హాజరుకానున్నారు. వీరితోపాటు గతంలో ఫెయిలైన 634 మంది పరీక్షలు రాయనున్నారు. వీరందరి కోసం 164 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. విద్యాశాఖాధికారుల సూచనల మేరకు ఈ కేంద్రాల్లో పోలీసుశాఖ భద్రతా ఏర్పాట్లు చేపట్టనుంది. 1,870 మంది ఇన్విజిలేటర్లుగా వ్యవహరిస్తారు.రెవెన్యూ, పోలీసు, విద్యాశాఖకు చెందిన అధికారులతో 8 ఫ్లయింగ్ స్క్వాడ్లను, 20 సిట్టింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేస్తున్నారు. 164 మంది ఛీఫ్ సూపరింటిండెంట్లను, 164 మంది డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లను నియమించనున్నారు.అన్ని కేంద్రాల్లో బెంచీలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

పకడ్బందీగా ఏర్పాట్లు



పరీక్షల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నాం. అన్ని కేంద్రాల్లో ప్రాథమిక వసతులు కల్పించనున్నాం. సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేశాం. పరీక్ష కేంద్రాల్లో గాలి, వెలుతురు ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం.

- కోట వెంకట నాగేంద్రకుమార్, డీఈవో

వ్యవసాయ బావిలో పడి కండక్టర్ మృతి

నారాయణవనం, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ బావిలో పడి కండక్టర్ మృతిచెందిన ఘటన మండలంలో శనివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు..పాపానాయుడుపేటకు చెందిన తులసి(50) తిరుమల డిపోలో కండక్టర్‌గా పనిచేస్తున్నారు. రెండు రోజుల క్రితం సొంత పనుల నిమిత్తం తిరుపతికి వెళ్లి వచ్చాడు. బహిర్భూమి నిమిత్తం మండల కాంప్లెక్స్ సముదాయం వద్ద బస్సు దిగాడు.సమీపంలోని పొలాల్లోకి వెళ్లి కాలకృత్యాలు తీర్చుకుని బావిలోకి దిగే క్రమంలో అందులో పడిపోయాడు. ఈత రాకపోవడంతో చనిపోయాడు. ఎస్‌ఐ రాజశేఖర్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.



మృతి చెందిన కండక్టర్ (ఫైల్ ఫొటో)

ముగ్గురు 'ఎర్ర'స్మగ్లర్ల అరెస్ట్

- రూ.25 లక్షల దుంగల స్వాధీనం

మంగళం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : రేణిగుంట-కడప హైవేలోని కరకంబాడి సమీపంలోని నెలవాగు రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతంలో డంప్ చేసి ఉంచి 26 ఎర్రచందనం దొంగలను స్వాధీనం చేసుకుని, ముగ్గురు స్మగ్లర్లను అరెస్ట్ చేసినట్లు తిరుపతి రేంజ్ అటవీ క్షేత్రాధికారి బి.సుదర్శన్‌రెడ్డి తెలిపారు. రహస్య సమాచారం మేరకు శుక్రవారం రాత్రి సిబ్బందితో కలిసి కరకంబాడి వద్ద ఉన్న రైల్వే బ్రిడ్జి వద్ద నిఘా వేసినట్లు చెప్పారు. రాత్రి 10 గంటల ప్రాంతంలో రెండు ద్విచక్ర వాహనాల్లో వచ్చిన నలుగురు వ్యక్తులు ఎర్రచందనం దుంగలను బయటకు తీస్తుండగా అదుపులోకి తీసుకున్నామన్నారు. రఘు అనే వ్యక్తి పారిపోయాడని తెలిపారు. మోటార్ సైకిళ్లను, ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నామన్నారు. వాటి విలువ రూ.26 లక్షలు ఉంటుందని చెప్పారు. ఈ దాడుల్లో తిమ్మినాయుడుపాలెం సెక్షన్ ఎఫ్‌ఎస్‌వో రమేష్‌బాబు, ఎఫ్‌బీవోలు వెంకటేశ్వరరావు, కిషోర్‌కుమార్, సురేష్‌బాబు, ప్రొటెక్షన్ వాచర్లు పాల్గొన్నారు.



స్మగ్లర్ల అరెస్ట్ చూపుతున్న అటవీ శాఖ అధికారులు

రాష్ట్రంలోనూ కమల వికాసం

- బీజేపీ సీనియర్ నేత తమిళిసై సౌందరరాజన్
- ఢిల్లీ విజయంపై మిన్నంటిన సంబరాలు

ప్యారీస్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది జరిగే రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లోనూ కమలం వికసిస్తుందని బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షురాలు డాక్టర్ తమిళిసై సౌందరరాజన్ జోస్యం చెప్పారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లోనే కాదు, ఉత్తరప్రదేశ్ అయోధ్య జిల్లాలోని మిల్కీపురం ఉప ఎన్నిక ఫలితాల్లో కూడా బీజేపీ ఘనవిజయం సాధించడాన్ని స్వాగతిస్తూ శనివారం బీజేపీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. టి.నగర్‌లోని కమలాలయ ప్రాంగణంలో తమిళిసై సౌందరరాజన్ బాణసంచా కాల్చి కార్యకర్తలకు స్వీట్లు పంచి సందడి చేశారు. ఈ వేడుకల సందర్భంగా తమిళిసై సౌందరరాజన్ మీడియాతో మాట్లాడుతూ... తమిళనాడు అసెంబ్లీకి 2026లో జరగనున్న ఎన్నికల్లో కూడా బీజేపీ అత్యధిక మెజార్టీ సాధిస్తుందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం అమలుపరుస్తున్న పథకాలే ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీని గెలిపించాయన్నారు. ఈ వేడుకల్లో రాష్ట్ర బీజేపీ ప్రచార విభాగం అధ్యక్షుడు పొన్నూరి రంగనాయకులు, పార్టీ అనుబంధ విభాగాల నిర్వాహకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కమలాలయం వద్ద టపాసులు కాలుస్తున్న తమిళిసై సౌందరరాజన్ - మిఠాయి తినిపిస్తున్న నాయకులు

నత్తేనయం

- కొనసా..గుతున్న ఎస్వీ మ్యూజియం అభివృద్ధి పనులు
- ఐదేళ్లుగా భక్తులకు దూరమైన చరిత్ర సమూహం

తిరుమల, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): చరిత్రను కళ్లకు కట్టినట్లు చూపించే ప్రపంచం, జాతి సంస్కృతికి ఆనవాళ్లు, ఎన్ని తరాలవారికైనా కనిపించే చెక్కుచెదరని రూపాలు కొలువై ఉన్న ఎస్వీ మ్యూజియం భక్తులకు దూరమై ఐదేళ్లు గడుస్తోంది. అభివృద్ధి పేరుతో ఎస్వీ మ్యూజియాన్నే మర్చిపోయేలా చేశారు. పూర్వం మ్యూజియం శ్రీవారి ఆలయం ముందున్న వేయికాళ్ల మండపంలో ఆర్ష సంస్కృతి సదస్సు పక్కనే ఉండేది. అయితే క్రమంగా సందర్శకులు పెరుగుతున్న క్రమంలో 1996లో నారాయణగిరి పర్వతం అనుకుని సువిశాలంగా శ్రీవేంకటేశ్వర మ్యూజియం పేరుతో రూ.3.5కోట్లతో నిర్మించారు. మొత్తం 7గ్యాలరీలు, ఒక మినీ థియేటర్‌ను రూపొందించారు. 14, 15, 16 శతాబ్దాల నాటి రాతి, లోహ, స్ఫటిక, పాలరాతి విగ్రహాలు, పురాతన వాయిద్యాలు, రాజులు వాడిన కత్తులు, రక్షణ కవచం, యుద్ధంలో వినియోగించిన ఆయుధాలు, ముఖ్యంగా మైసూరు మహారాజు సమర్పించిన దంతపు పల్లకీ ఈ మ్యూజియం ద్వారా భక్తులకు దర్శనమిచ్చేవి. ఇక, బ్రహ్మోత్సవాలలో నిర్వహించే వాహనాలు, పుణ్యతీర్థాలు, నిజపాదాల రూపం, దశావతారాల ప్రతిమలు, శ్రీవారి ఆలయాన్ని అంచెలంచెలుగా నిర్మించిన సామంతరాజులు, శ్రీకృష్ణదేవరాయలు, తోడరమల్లు, అచ్యుతదేవరాయలు, అట్ల కుమార అనంతరాజులు, వెంకటపతి దేవరాయల ఫొటోలు కూడా ఉండేవి. ప్రత్యేకించి కపిలతీర్థం, తిరుచానూరు అమ్మవారి ఆలయంలో ఉపయోగించిన 18వ శతాబ్దానికి చెందిన గంటలు, కొయ్య పాదుకలు, స్వామివారి నిలువెత్తురూపం, ఇత్తడి పాదుకలు, రాగి పళ్లెం, దీప-ధూప స్తంభాలు, రాయలకాలం నాటి సంగీత వాయిద్యాలు, శ్రీనివాసమంగాపురం, గోవిందరాజుల స్వామి ఆలయ ప్రధాన ద్వారాలు, 17వ శతాబ్దం నాటి అలిపిరి వద్ద చెక్క మండపం, శ్రీకృష్ణలీలలు, శ్రీవారి రథంపై అలంకరించే తపోతదూళం, గరుడ, ద్వార పాలకుల విగ్రహాలు, వందల ఏళ్ల క్రితం నాటి నాణేలు, వస్తువులు, శాసనాలు, రాగిరేకులు ఇలా చరిత్రకు సంబంధించి అనేక వస్తువులను ఎస్వీ మ్యూజియం ద్వారా భక్తులు తిలకించేవారు.



తిరుమల ఎస్వీ మ్యూజియం

రూ.125 కోట్లతో ముందుకు వచ్చిన టాటా సంస్థ

తిరుమలోని ఈ మ్యూజియాన్ని అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దాలని టీటీడీ నిర్ణయించగా, అందుకు టాటా సంస్థ ముందుకు వచ్చింది. రూ.125 కోట్లతో అభివృద్ధి పనులు చేసేందుకు అంగీకారం తెలిపింది. అలాగే బెంగళూరుకు చెందిన మ్యాప్ సిస్టమ్స్ సంస్థ కూడా 'టెంపుల్ ఎక్స్‌పీరియన్స్ గ్యాలరీ' ఏర్పాటుకు రూ.20 కోట్లు ఇచ్చేందుకు ముందుకు రావడంతో 2020 మార్చి నుంచి మ్యూజియానికి భక్తుల అనుమతిని టీటీడీ రద్దు చేసింది. ఆ పనులు నేటికీ నత్తనడకన కొనసాగుతున్నాయి. కొవిడ్ ఆంక్షలతో కొంతకాలం పనులు ఆగిపోతే, అధికారుల నిర్లక్ష్యంతో మరికొంతకాలం నత్తనడకన సాగినట్టు ఆరోపణలున్నాయి. గతేడాది బ్రహ్మోత్సవాల నాటికైనా ఆధునీకరణ పనులు పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని ప్రయత్నించినా పనులు మాత్రం ముందుకు సాగలేదు. దీనికి కారణం సరైన మ్యూజియం అధికారులు లేకపోవడమనే విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారుల నుంచి సరైన స్పందన లేకపోవడంతో టాటా సంస్థకు చెందిన ప్రతినిధులు కూడా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్టు తెలిసింది.

ప్రశాంతంగా గ్రూప్-2ఎ మెయిన్స్

పెరంబూర్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా గ్రూప్-2ఎ మెయిన్ పరీక్ష 82 కేంద్రాల్లో ప్రశాంతంగా ముగిసింది. తమిళనాడు ప్రభుత్వ ఉద్యోగుల ఎంపిక కమిషన్ (టీఎన్‌పీఎస్సీ) గ్రూప్-2, గ్రూప్-2ఎ విభాగాల్లోని 2,540 ఖాళీ పోస్టుల భర్తీకి గత ఏడాది జూన్ 20వ తేది నోటిఫికేషన్ విడుదల చేసింది. అందులో గ్రూప్-2-2ఏలో మొత్తం 48 విభాగాల్లో 2,006 ఖాళీ పోస్టులు భర్తీ చేయనున్నట్లు నోటిఫికేషన్‌లో ప్రకటించారు. ఈ పోస్టుల భర్తీకి ప్రిలిమినరీ పరీక్ష సెప్టెంబరు 14వ తేది నిర్వహించారు. వాటి ఫలితాలు డిసెంబరు 12న విడుదలయ్యాయి. ఈ క్రమంలో గ్రూప్-2, గ్రూప్-2ఏ పోస్టుల భర్తీకి మెయిన్స్ శనివారం జరిగింది. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు మెయిన్ పరీక్ష-2, పేపర్-1 తమిళ లాంగ్వేజ్ ఆప్టిట్యూట్ పరీక్ష మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగింది. జనరల్ నాలెడ్జికి 21,563 మంది, జనరల్ తమిళంకు 16,457 మంది, జనరల్ ఇంగ్లీషుకు 5,106 మంది అభ్యర్థులు హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన తమిళ భాషా అర్హత పరీక్షకు 21,607 మంది హాజరయ్యారు. ఈ పరీక్ష కోసం రాష్ట్రవ్యాప్తంగా 82 కేంద్రాలు ఏర్పాటుచేశారు. గంట ముందుగానే అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించడంతో తెల్లవారుజాము నుంచే అభ్యర్థులు కేంద్రాలకు చేరుకున్నారు. 8.30 గంటల నుంచి అభ్యర్థులను తనిఖీ చేసిన అనంతరం పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించారు. అభ్యర్థులకు అవసరమైన తాగునీరు సహా మౌలిక వసతులు, వైద్య శిబిరం కూడా కేంద్రాల వద్ద ఏర్పాటుచేశారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశారు.



పరీక్ష రాస్తున్న అభ్యర్థులు

త్వరలో మరిన్ని ఎలక్ట్రిక్ బస్సులు

- ఆర్టీసీ ఈడీ చెంగల్‌రెడ్డి

తిరుపతి(ఆర్టీసీ), ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): మంగళం డిపో పరిధిలోకి త్వరలో 50 ఎలక్ట్రిక్ బస్సులు రానున్నాయని ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తిమ్మాడి చెంగల్‌రెడ్డి తెలిపారు. అలిపిరి డ్రైవర్స్ క్వార్టర్స్ వద్ద అధునాతన సౌకర్యాలతో నిర్మిస్తున్న ఆర్టీసీ ఆస్పత్రిని శనివారం ఆయన సందర్శించారు. దాదాపు రూ. 6కోట్ల నిధులతో నిర్మిస్తున్న ఈ భవనం ప్రస్తుతం గ్రౌండ్, ఫస్ట్‌ఫ్లోర్ పూర్తకాగా, సెకండ్ ఫ్లోర్ నిర్మాణం పూర్తయ్యాక ప్రారంభ ఏర్పాట్లు చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఏప్రిల్‌లో ప్రారంభోత్సవం చేసేలా చూడాలన్నారు. అనంతరం అలిపిరి డిపోలో ఎలక్ట్రిక్ బస్సు చార్జింగ్ స్టేషన్‌ను, బస్సులను పరిశీలించారు. డీఎంతో సమీక్షిస్తూ ఇప్పటికే వంద ఎలక్ట్రిక్ బస్సులు జిల్లాలో నడుస్తున్నాయన్నారు. త్వరలోనే 50ఎలక్ట్రిక్ బస్సులు తిరుపతికి రానున్నాయన్నారు. ఇందుకు ఏర్పాట్లు పూర్తి చేయాలని డీపీటీవో నరసింహులను ఆదేశించారు. డిప్యూటీ సీటీఎం విశ్వనాథం, డీఈ చెన్నకేశవులు, డీఎంలు బాలాజీ, హరిబాబు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఈడీ చెంగల్‌రెడ్డి

చెరువులో ఈతకెళ్లిన యువకుడి గల్లంతు

బంగారుపాళ్యం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): చెరువులో ఈతకెళ్లిన ఓ యువకుడు గల్లంతయ్యాడు. సీఐ కత్తి శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు.. చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మండల పరిధిలోని శ్రీని ఫుడ్ పార్క్‌లో ఉన్న ఫోడ్రాన్ కంపెనీలో సెల్వకుమార్(27), ప్రశాంత్, శరవణన్, గోపీనాథ్ పనిచేస్తున్నారు. వీరంతా శుక్రవారం మధ్యాహ్నం తర్వాత మొగిలి సమీపంలోని గౌనిచెరువులో ఈత కొట్టడానికి వెళ్లారు. సాయంత్రం సమయంలో లోతు ఎక్కువగా ఉన్న ప్రదేశంలోకి సెల్వకుమార్ వెళ్లడంతో మునిగిపోయాడు. గమనించిన స్నేహితులు అతడిని బయటకు తీసుకురావడానికి ప్రయత్నించి, విఫలమయ్యారు. ఈ విషయాన్ని ఫోడ్రాన్ కంపెనీ ఇన్‌చార్జి గోపికి తెలియజేశారు. ఆయన మరికొంతమందిని తీసుకొచ్చి గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో బంగారుపాళ్యం పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వెంటనే పలమనేరు అగ్నిమాపక అధికారులకు తెలియజేయగా.. వారు గజ ఈతగాళ్లతో చెరువు వద్దకొచ్చి గాలింపు చర్యలు చేపట్టారు. శనివారం సాయంత్రానికి కూడా మృతదేహం లభ్యం కాలేదు.



సెల్వకుమార్ (ఫైల్ ఫొటో)

శోకసంద్రంలో కుటుంబీకులు

సెల్వకుమార్ గల్లంతైన విషయం తెలుసుకున్న ఆయన తల్లి, అక్క చెరువు వద్దకు చేరుకున్నారు. కుటుంబాన్ని పోషించడం కోసం తమిళనాడు రాష్ట్రం నామక్కళ్ నుంచి ఇక్కడికొస్తే.. ఇలా జరిగిందని వారు బోరున విలపించారు.

మహా శివరాత్రి ఉత్సవాల కోసం రథాలకు మెరుగులు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): మహా శివరాత్రి ఉత్సవాల కోసం జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామి ఊరేగనున్న రథాలకు అధికారులు మెరుగులు దిద్దే పనులు చేపట్టారు. ముక్కంటి ఆలయ భిక్షాల గాలిగోపురం సమీపంలో స్వామి అమ్మవార్ల రథాలు ఉన్నాయి. వీటికి రక్షణగా ఏర్పాటు చేసిన ఇనుప రేకులను తొలగించారు. రథాల పటిష్టతను పరిష్కరించడంతో పాటు అవసరమైన మెరుగులు అద్దే పనులను ప్రారంభించారు.

